శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురోపినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:2 సంచిక:6 త్రైమాసిక పత్రిక మార్చి - 1999

## సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!



ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి! సాయిపద
రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద
వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!

ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన మనసులు
మత్తెక్కాలి! సాయి
ప్రేమామృతధారలు అంతటా
నిరంతరం వర్షించాలి! ఆ
ప్రేమామృత ధారలలో
తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల
మత్తులో ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

*********************************************************************************

ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | సంకుచితత్వములేని సాంప్రదాయ సాకార మూర్తి | డా\|\| సాయినాథుని శరద్బాబూజీ (సాయిపథం నుండి) |
| 4. | మాటల్లో చెప్పలేను అనుగ్రహించిన పైనం | బి.పి.యస్.ప్రసాద్ |
| 5. | ప్రేమ పూర్వకమయిన కృతజ్ఞతా భావమే శరణాగతి | పి. సాయిప్రసాద్ |
| 6. | నాడు గయలో బాబా - నేడు నెల్లూరులో బాబూజీ | కె.ఎస్.శ్రీనివాసమూర్తి |
| 7. | సాయినాథుని లీల | రావుల కోటేశ్వరరావు |
| 8. | గురుదేవుల రక్ష - నా పాలిట లక్ష | ఎం.సూరారెడ్డి |
| 9. | రక్షించింది గురువుగారే - ఆదరించింది గురువుగారే | మురళి |
| 10. | నడయాడే సాయిరూపం | డా\|\| జి. సాయివరప్రసాద్ |

## ఉన్న మాట - అనుకున్న మాట

ఈ పత్రిక "గురుకృప"తో నిర్వహింపబడుతున్న పత్రిక. అందుకే దీనిని "గురుకృప" అనే నామంతో వ్యవహరిస్తున్నాం. ఏ ఒక్క వ్యక్తివలనో, ఏ ఒక్కరి డబ్బుతోనూ ఈ పత్రిక నడుపబడటంలేదు. ప్రతి పత్రిక విడుదల వెనుక ఎందరో గురుబంధువుల శ్రద్ధ - భక్తి నిక్షిప్తమై ఉన్నాయి. దీని నిర్వహణలో ఉన్నవారందరూ పేరుకోసంగాక "గురుసేవ" అనుకొని కృషిచేస్తున్నారు. కాబట్టి ఎవరిపేరును ప్రత్యేకించి పరిగణలోనికి తీసుకోబడుటలేదు. గురూజీ ఆశీస్సులే దీనికి అంగబలం - అర్థబలం. గత సంచికలో దీని ఆవిర్భావం గురించి ప్రస్తావించటం జరిగింది. కనుక ఇక ఆ ప్రసక్తికి స్వస్తి.

ఈనాటి సంచికకు మేముకోరిన వెంటనే ఎందరో గురుబంధువులు తమ అనుభవాలను, గురువుగారి లీలలను మేము ఆశించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో పంపటం జరిగింది. పత్రికపట్ల గురుబంధువులలో పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శనంగా భావించవచ్చు.

ఇటీవలి సంచికలు చదివిన చాలామంది గురుబంధువులు గత సంచికలు - అంటే, 1,2,3,4 సంచికలు కావాలని, ఎంత డబ్బు పంపమంటారని వ్రాస్తున్నారు. ఈ విషయంలో మేము ముందు జాగ్రత్త తీసుకొని పాత సంచికలు నిల్వవుంచలేకపోవటంవల్ల వారికి సేవ చేసుకోలేని మా నిస్సహాయతకు చింతిస్తున్నాం.

ప్రస్తుతం మా వద్ద 3, 5 సంచికలు అందుబాట్లో ఉన్నందున ఒక రూపాయిస్టాంపు అంటించిన సెల్ఫ్ అడ్రస్డ్ కవరును పంపినవారికి ఆ సంచికలు పంపగలం.

"ఆ చేయి ఎంత హాయి" చాలాబాగుంది. క్రొత్త సంచిక ఎప్పుడు వస్తుందాని ఆగి ఎదురుచూస్తున్నాం. మాకు ఒక కాపీ పంపండి అని ఎందరో వ్రాస్తున్నారు. వారందరికీ కాపీలు పంపే ఏర్పాటు చేస్తున్నాం.

భవిష్యత్తులో కూడా "గురుకృప" పై మీ శ్రద్ధ-సబూరీ ఇలాగే కొనసాగాలనీ, తద్వారా మీ సమస్యలు సానుకూలమై మీ జీవితాలు ప్రశాంత-ప్రమోదాలతో విలసిల్లాలని, ప్రమాదినామ సంవత్సరంలో "గురుకృప" మనందరిపై మరింతగా ప్రసరిల్లాలని ఆకాంక్షిస్తూ, గురుబంధువులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలందజేస్తున్నాం.

-గురుబంధువులు

## సంకుచితత్వము లేని సాంప్రదాయ సాకార మూర్తి

మే 91- సాయిపథం నుండి

మన గురూజీ సాయినాథుని శరత్ బాబూజీ నిర్వహణలో వెలువడిన "సాయిపథం" కేవలం సాయితత్వాన్నే కాక ఎందరో అవధూతల జీవిత విశేషాలను ప్రచురించడం ద్వారా అందరి యెడల వారికి గల ప్రేమతత్వాన్ని మనకు తెలియజేస్తుంది.

ఒక వ్యాసం వ్రాసారు అంటే, ఆ వ్యాసం చదివిన పాఠకులకు వారు చేసిన విషయసేకరణ, నిశిత పరిశీలన, ఆశ్చర్యం కలిగిస్తాయి. పూర్తి అవగాహనతో ఎంతో లోతుగా ఎన్నో వివరాలతో ఇంతటి సమాచారాన్ని ఎలా అందించగలిగారు అన్న సందేహం కలగక మానదు.

ఆ కోవలోకి చెందినదే ఈ క్రింద ప్రచురించిన "సాయిపథం" లోని..... వ్యాసం.

ఈ వ్యాసం ద్వారా మనము గ్రహించవలసిన శ్రీ గురూజీ బోధ ఏమిటంటే అనేక సమస్యలతో మహాత్ముల వద్దకు వెళ్ళే మనము అందరు తెస్తున్నారు మనము ఉత్త చేతులతో వెళితే ఏమి బాగుంటుంది అని పూలు, పండ్లు, కానుకలు ఇవ్వచూస్తాము. కాని వారు కోరేది మాత్రం నిశ్చలమైన భక్తి అని మనకు తెలుపుతున్నారు. బాబా కోరిన 2పైసలు కాని, 'పెద్దాయన' కోరిన రెండు నిముషాలు ఒక్కటే. శ్రద్ధ సబూరి, ఇది మనము నడవవలసిన సాధనాపథం అదే సాయిపథం - "గురుకృప"

పెరియవర్('పెద్దాయన') అనీ, 'నడమడ దైవం' - (నడయాడే దైవం) అనీ లక్షలాది మంది భక్తులు ఆయన్ను గురించి ప్రేమగా ప్రస్తావిస్తారు. వేదశాస్త్రపురాణేతిహాసాలలో ఆయనకు అధికారికమైన పాండిత్యం వుంది. అన్ని దేశభాషలలోనే కాకుండా కొన్ని విదేశీ భాషలలో కూడా విశేష పరిజ్ఞానం కల బహుభాషాకోవిదుడు, భాషావేత్త. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆయా రంగాలలో నిష్ణాతులైన పండితులు ఎందరో తమ తమ రంగాలలో తమకు కలిగిన సందేహాలను నివృత్తి చేసుకొనేందుకు వారిని ఆశ్రయిస్తుంటారు కానీ, వారు మాత్రం ఎక్కడికి వెళ్ళినా, ఎవరు వారి దర్శనానికి వచ్చినా, ఆ సందర్శకులను వారివారి రంగాలలో ఎంతో ఆసక్తితో, వినయంతో విషయ గ్రహణచేస్తూ, తమకున్న పరిజ్ఞానాన్ని ఇంకా పటిష్టం చేసుకోవడం మాత్రం మానరు. బహుశా అందుకే వారు ఒక "విజ్ఞాన సర్వస్వం" గా భాసిల్లుతున్నారు. అన్నింటికీ మించి వారు పొందిన మహోన్నత ఆధ్యాత్మిక స్థితి. అది వారి సన్నిధిలో కొంతసేపు స్థిరంగా ధ్యానం చేసుకొంటే ఎవరికైనా యిట్టే అనుభవమవుతుంది. ఒక్కమాటలో శోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన సద్గురువుకు వారు నిర్వచనమనిపిస్తుంది.

సామాజికంగా ఆయనొక ప్రఖ్యాత సనాతన పీఠానికి అధిపతి. సన్యాసి. ప్రస్తుతం పంచమాశ్రమంలో వున్న అవధూత. ఆధ్యాత్మిక దృష్టిలో ఆయనొక గొప్పజ్ఞాని. సిద్ధపురుషుడు. ఇంతకూ ఆయనెవరో కాదు - కంచి శంకరాచార్య పీఠం పరమాచార్య - శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి.

ఆయన పొందుతున్న యీ అభిమానం, గౌరవం ఆయన స్వార్జితమే గాని కేవలం ఒక పీఠాధిపతి అవడంవల్ల సంక్రమించింది కాదు. ఎన్నో కారణాల వల్ల ఆదిశంకరులలోనయినా దోషాలు చూపే వారున్నారేమో గానీ, శ్రీ స్వామి వారిని మాత్రం విమర్శింప సాహసింపలేరు. తమనెవరైనా ఆహ్వానిస్తే 'పాదపూజ', 'భిక్ష' కు గ్యారంటీ యిస్తే గానీ పాదం మోపమని మొరాయించే మఠాధిపతులను చూస్తుంటే, ఆ మఠాధిపతుల కోవలో శ్రీస్వామి వారు విజాతీయులా అని అన్పిస్తుంది. తాము అధివసించిన పీఠం యొక్క నియమాలకు తల ఒగ్గి అట్టహాసంతో గూడిన మంది మార్భలం మధ్య ఒక్కోసారి వారు కనిపించినా, వ్యక్తిగతంగా వారు ఎంత నిరాడంబరులో ఎంత సాత్వికమైన ఆహారాన్ని ఎంత మితంగా భుజిస్తారో, ఎంత తక్కువగా నిద్రిస్తారో చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆయన నిరాడంబర జీవనం, సాధువర్తనం, సన్యాసులకు, సాధువులకు ఆదర్శప్రాయం. మహాత్ముల ధర్మాచరణకు ప్రతీక. ఇంత వయసులో కూడా (ఇప్పుడు వారి వయస్సు 95 సం||) ఎన్నో సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు, వేలాది భక్తుల పేర్లు వారి కుటుంబ వివరాలు పొల్లు పోకుండా చెప్పగలిగే వారి జ్ఞాపకశక్తి మరో అద్భుతం.

శ్రీస్వామివారు 1894లో(ఆదివారం మే 20వ తేదీన) తమిళనాడులోని విల్లుపురంలో జన్మించారు. పూర్వాశ్రమ నామం స్వామినాథన్. వీరి పూర్వాశ్రం కుటుంబము హోసైల్, కర్ణాటక స్మార్తబ్రాహ్మణ శాఖకు చెందినవారు. 13-2-1907లో అంటే తమ 13వ ఏట, చంద్రశేఖరేంద్ర సరస్వతి పేరుతో సన్యాసాశ్రమం స్వీకరించి, కంచి కామకోటి పీఠాధిపతిగా అభిషేకించబడ్డారు. అప్పట్లో కొన్ని మఠ నిర్వహణ సంబంధమైన కారణాలవల్ల ( 1783లో సిద్ధిపొందిన 62వ శంకరాచార్య కాలం నుండి) మఠం ప్రధాన కార్యాలయము కంచి నుండి కుంభకోణానికి మార్చబడింది.

శ్రీ స్వామివారి హయాంలోనే మఠం ప్రధాన కార్యాలయం కుంభకోణం నుండి కంచికి తిరిగి మార్చబడింది. పీఠానికొచ్చిన తరువాత శ్రీస్వామి 1909 నుండి 1914 వరకు మహాదేవ మంగళం అనే ప్రదేశంలో వేద శాస్త్ర పురాణేతి హాసాలలో జ్యోతిష ఖగోళ గణిత సంగీతాది శాస్త్రాలలో విద్యాభ్యాసం, సాధనలో గడిపారు. తర్వాత దేశాటన, ఆధ్యాత్మిక ప్రబోధం మఠ సంబంధమైన కార్యకలాపాలలో అవిశ్రాంతంగా నిమగ్నమయ్యారు. అయితే 1965 లోనే పీఠాధిపత్యాన్ని వదలి, అంటే మఠానికి సంబంధించిన బాధ్యతలను తమ వారసునికి అప్పజెప్పి, అత్యాశ్రమివలె కేవలం దేశసంచారం చేస్తూ ఆధ్యాత్మిక ప్రబోధంలో నిమగ్నమైవున్నారు.

శ్రీ స్వామివారు రైలు, కారు మొ||న మోటారు వాహనాలలో ప్రయాణం చెయ్యరు. పల్లకీ వుంటుంది; కానీ అది నామ మాత్రం.సాధ్యమైనంత వరకు పాదచారియై ప్రయాణిస్తారు. తల్లవారుఝామున బ్రహ్మముహూర్తంలో నిద్రలేచింది మొదలు రాత్రి సుమారు ఒంటిగంట వరకు శాస్త్ర చర్చలు, శ్రవణము, సందర్శకులకు దర్శనమిచ్చి వారి యోగక్షేమాలు విచారించడం మొ||న కార్యక్రమాలలో అవిశ్రాంతంగా వుంటారు. ఆపైన నేలమీదనో, బల్లపైనో ఒక గుడ్డ పరుచుకొని నిద్రిస్తారు.

భిక్షా స్వీకార విషయంలోనూ, ఆహార విహారాదుల విషయంలోను సన్యాసాశ్రమంలో వున్న యతికి విధింపబడ్డ నియమాలను కఠోర నిష్ఠతో పాటిస్తారు. ఒక్కపూట భోజనం, అదీ పులుసు, ఉప్పు, కారము మొ||నవి లేని ఆహారం. కొద్దిగా పచ్చిపాలు, మూడు గుప్పిళ్ళ అన్నం స్వీకరిస్తారు. కొంతకాలం బిల్వదళాలు, మరికొంతకాలం వేప ఇగుళ్ళు తీసుకునేవారు. అప్పుడప్పుడు కొంతకాలం మౌనవ్రతం పాటిస్తారు. ఎప్పుడూ ఆయన సంతకం చెయ్యరు. దాని బదులు శ్రీకార ముద్రను ఉపయోగిస్తారు.

విదేశీయులు మ్లేచ్ఛులనీ, వారిని చూడటం, దర్శనమివ్వటం అనాచారమనే ఛాందస మతాచార్య పరంపరలో - పాల్ బ్రంటన్, అర్థర్ ఐసెన్ బర్గ్, రాబర్ట్స్ వాల్సెర్, డానియల్ స్మిత్, అర్థర్ కోయిస్లర్ మొ||న ఎందరో విదేశీయులకు ఇంటర్వ్యూలిచ్చి కొత్త ఒరవడి సృష్టించారు. సమర్థుడయిన గురువును అన్వేషిస్తూ దేశమంతా పర్యటిస్తున్న పాల్ బ్రంటన్‌ను భగవాన్ రమణమహర్షిని ఆశ్రయించమని సలహా చెప్పింది(1931లో) శ్రీ పెద్దస్వామి వారే, ఒకవేళ తాను గుర్వన్వేషణలో విఫలమైతే శ్రీస్వామివారు తనను శిష్యుడుగా స్వీకరిస్తారా అని బ్రంటన్ అడిగినప్పుడు శ్రీ స్వామి, "నేను ఒక మఠాధిపతిని. నా సమయం నా స్వంతం కాదు. నాకున్న కాలమంతా మఠ నిర్వహణలోనే సరిపోతుంది. కొన్ని సంవత్సరాలుగా నేను మూడు గంటలకు పైగా నిద్రపోయింది లేదు. అలాంటప్పుడు నేను వ్యక్తిగతంగా శిష్యులను ఎలా స్వీకరించగలను? మీకోసం తన కాలాన్ని వ్యయపరచగల మహాత్ముడు కోసం మీరు వెదకాలి" అని సమాధానమిచ్చారు.

దాదాపు వారి జీవితమంతా అత్యంత సనాతన సాంప్రదాయాల విధి నిషేధాల మధ్యగడిచినా, ఆయనలోని స్వతంత్ర భావనా కుసుమం పసివాడి పోలేదని ఆయన బోధనలు, ఆయన వ్యవహార సరళి పరిశీలిస్తే ఇట్టే బోధపడుతుంది. శ్రీ స్వామి చాలామంది సాంప్రదాయక పండితుల్లా వేదశాస్త్ర పురాణేతిహాసాలపై ఆధునిక పండితుల, చరిత్రకారుల అభిప్రాయాలను గ్రుడ్డిగా త్రోసి పుచ్చరు. ఎన్నో జాతీయ అంతర్జాతీయ విషయాలపై నిశితంగా శ్రీ స్వామిని ప్రశ్నించిన బ్రంటన్, వారిని గూర్చి అంటారు. "భారతీయ సంస్కృతి యొక్క గొప్పతనాన్ని చెప్పడానికి, పాశ్చాత్య సంస్కృతిని దూషించేవారి కోవలోకి శ్రీ స్వామి రారని గ్రహించాను" అని. అరవిందాశ్రమ వాసియైన దేవదత్ అనేవారు, "ఆధునిక విజ్ఞానం వల్ల ప్రాచీన సంస్కృతి నశించే పక్షంలో దానివల్ల ప్రయోజనం ఏమిటి?" అని ప్రశ్నించినపుడు, శ్రీ స్వామి వారు చెప్పిన సమాధానం "అన్నీ మన వేదాలలో వున్నాయట!" అని మూఢత్వంలో మురిసిపోయే ఛాందసులు గుర్తించుకోవలసింది. అప్పుడు శ్రీ సావామివారన్నారు; "పురాణమిత్యేవ న సాధు సర్వం - ప్రాచీనమైనంత మాత్రాన దానినే సంపూర్ణంగా గ్రహించడం మన వుద్దేశ్యం కాదు. ప్రాచీనతతో బాటు ఉత్తమమైన నవీనత్వాన్ని కూడా స్వీకరించడం మన పరమధర్మం. దేశంలోని ప్రతి యువకుడూ ఈ రెండింటి సమన్వయాన్ని

సాధించడం కళ్యాణప్రదం. భారతీయ సంస్కృతిని రక్షించడం మా ధ్యేయం. అయితే ఆధునిక ప్రజాజీవనము, వారి ఆదర్శాలు, ఆకాంక్షలూ కూడా గౌరవించి నవీనతను ఆహ్వానిస్తున్నాం" అని. అంతేకాదు సంకుచిత కులతత్వం రూపుమాపాలన్నది శ్రీ స్వామి వారి అభిమతం(Vide 'The Hindu'. June24, 1931) కేవలం సనాతనమైనపి కనుక సతీసహగమనము, కులతత్వం మొ|| మూఢాచారాలనూ, సాంఘిక దురాచారాలను సమర్థిస్తూ ప్రచారంచేసే పీఠాధిపతులకు, ఆచార్యవర్యులకు, ఆ ప్రచారాలకు ఆనందంగా తలలూపే సనాతనులకు శ్రీ స్వామి వారి ప్రబోధం కనువిప్పు కావాలి.

'జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్రస్వామి వారికి సమకాలికులవడం మనభాగ్యం. ఆ భాగ్యం వారి దర్శన భాగ్యం కలుగనంత వరకూ పూర్ణం కాదు.' అంటారు - శ్రీ స్వామి బోధనలను పదకొండు సంపుటాలలో "జగద్గురు బోధలు" గా ఆంధ్రీకరించిన శ్రీ విశాఖగారు. ఇంకా స్వామి వారిని దర్శించని, సాధకులు ప్రస్తుతం కంచిలో ఉంటున్న శ్రీ స్వామి వారిని అవశ్యం దర్శించి ఆశీస్సులు పొందడం ఎంతైనా శుభప్రదం.

శ్రీ స్వామివారు అధిష్టించిన పీఠము 'కామకోటి' కోటానుకోట్ల జీవుల యొక్క కోరికలు ఒకే పర్యాయం తీరితే ఎంతటి ఆనందం కలుగుతుందో అంతటి ఆనందం తానై పొందుతున్న పూర్ణకాముడాయన. ఆయనకు లేనిదిలేదు. అయినా అంతటి ఆప్తకామునికి కూడా ఒక కోరిక మిగిలిపోయింది. అది చిన్న కోరికే అయినా అది తీరటం కష్టం. అదేమిటో ఆయన మాటల్లోనే చూద్దాం. "అంతా నా దగ్గరకు వస్తుంటారు, పూలు, పండ్లు కానుకలు తెస్తుంటారు. నాకు ఇవేమీ మీరు ఇవ్వనక్కరలేదు. రోజుకు రెండు నిమిషాల కాలం నాకై వినియోగించండి. ఆ రెండు నిముషాల కాలం నిశ్చలభక్తితో పరమేశ్వరుణ్ణి ధ్యానించండి. క్రమంగా మనస్సు నిశ్చలమవుతుంది.

అదే నాకు ప్రియమైన కానుక. మీరు రోజంతా మీమీ లౌకిక వ్యాపారాలతో ఖర్చు పెట్టుకుంటున్నారు. ఈ పేదసన్యాసికి ఒక రెండు నిముషాలు త్యాగం చెయ్యలేరా? నేను కోరేదిదే! నన్ను నిరాశపరచకండి" శ్రీ స్వామి వారి ఆ చిన్నకోరిక తీర్చి మనం కృతార్థులమవుదము గాక.

## "మాటల్లో చెప్పలేను గురువు అనుగ్రహించిన వైనం"

నేను M.Sc. రెండవ సంవత్సరము నూజివీడులో చదివేటప్పుడు అనగా 1995-96వ సంవత్సరంలో చాలా అసహనం, బాధ, అసంతృప్తిగా జీవించేవాడిని. నాకు ఆనందం అంటే రుచి తెలిసేది కాదు. అందరూ ఆనందంగా గడుపుతూ వుంటే నేను మాత్రం అందుకు భిన్నంగా ఉండేవాడిని. నాకు కాలేజి వాతావరణం పూర్తిగా వ్యతిరేకముగా ఉండేది. ఉపాధ్యాయుల యెడ నేను సరి అయిన భావనతో ఉండేవాడిని కాదు. రోజులు గడిచేకొద్దీ నాలో అసహనం, బాధ, అనారోగ్యం పెరిగి పోతున్నాయి. జనవరి నెల(28) చివర నుంచి అనారోగ్యం ప్రారంభం అయింది. వాంతులు, విరోచనాలు ప్రారంభమైనాయి. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. మా మాష్టారు గారైన సాయిప్రసాద్‌గారు సద్గురువులు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీగారి ఆశీర్వచనములు తీసుకోమని చాలా పర్యాయములు చెప్పారు. కాని మానవమాత్రుడు అయిన గురువుగారు, నా సమస్యకు పరిష్కారం చూపరనే భావనతో నేను వినేవాడిని కాను. చివరకు మార్చినెల పూర్తికా వచ్చింది. పరీక్షలు సమీపిస్తున్నాయి. పరీక్షలు వ్రాయటం ఆపేయాలని దృఢనిర్ణయానికి వచ్చాను. ఒకరోజు సర్వం వదిలివేసి షిరిడీ బయలుదేరాను. అదేమి మహత్యమో కానీ నేను అన్నీ సర్దుకుని ప్రయాణానికి సిద్ధం అయిన వెంటనే విపరీతం అయిన బలహీనం, విరోచనాలు ప్రారంభం అయినాయి. నేను బ్రతుకుతాననే ఆలోచన నాలో లేదు. షిరిడీ ప్రయాణాన్ని మానుకొని ఇంటికి అంటే కందుకూరు వచ్చాను. ఎందుకో ఒకరోజు అనగా మార్చి 4వ తేది నాలో తెలియని, ఆనందం, ఉత్సాహం, ఆరోగ్యం క్షణంలో పొందాను. వెంటనే లేచి బాబాగుడిలో హారతికి వెళ్ళాను. కారణం తెలియలేదు. నేను సాయిప్రసాద్ మాష్టరు గారి కోసం ఎదురుచూస్తూ వున్నాను. 12-00 గంటల సమయములో మాష్టరుగారు వచ్చి, "గురువుగారు

తిరుమలకు వచ్చారు. నీ విషయం మాట్లాడాను. గురువుగారు ఆశీర్వదించారు" అని చెప్పారు. దానితో నాకు గురువుగారి యెడల అపారమైన నమ్మకం ఏర్పడింది. మార్చి 14వ తేదీన సత్సంగం సాయిప్రసాద్ మాష్టరు చేసారు. 15వ తేదీన తిరుమలలో గురువుగారి దర్శనం చేసుకున్నాను. మార్చి 26వ తేదీన పరీక్షలు ప్రారంభమైనాయి. ఉత్తీర్ణం కాను అనుకొన్న నేను ఎంతో ఉత్సాహంతో పరీక్షలు వ్రాసాను. అంతేగాక గురువుగారి దర్శనం వలన నేను జీవితంలో పొందలేను అనుకున్న ఆనందాన్ని ప్రతిరోజు అనుభవిస్తున్నాను. అంతేకాక నాకు కావలసిన లెక్చరర్ ఉద్యోగం ఇప్పించి నాకు తృప్తికరం అయిన విధంగా నాచే పిల్లలకు పాఠాలు చెప్పిస్తున్నారు గురువుగారు. గురువుగారు నాకు మాత్రమేకాక మా యింట్లో అందరికి మానసికశాంతిని కలిగించారు. గురువుగారు నన్ను అనుగ్రహించిన తీరు మాటలతో చెప్పలేనిది. ఆ అనుభవం అనుభవించి తీరాలి. భగవంతుడు ఎలా వుంటాడో అనుకునే నాకు భగవంతుడు గురువుగారి రూపంలో ఉంటారని తిరుమలలో వారి దర్శనం చేసుకొన్న తరువాత తెలిసింది. నన్ను అనుక్షణం దగ్గర ఉండి గురువుగారు కాపాడుతున్నారు. నాకు అనుక్షణం వారి వద్దనే వుండాలని ఆర్తిగా వుంది. నన్ను గురువుగారి దగ్గరకు తీసుకువెళ్ళిన నా గురుబంధువులు మరియు ఉపాధ్యాయులు శ్రీ సాయిప్రసాద్ మరియు సాయివరప్రసాద్ రావుగారలకు (తెనాలి) జన్మ జన్మలకు ఋణపడి ఉంటాను. గురువుగారి ఆశీర్వచనములతో యిలాంటి అనుభవాలు ఎన్నో పొందాను.

10-7-1996
కందుకూరు "బి.వి.యస్.ప్రసాద్"

## ప్రేమ పూర్వకమయిన కృతజ్ఞతా భావమే శరణాగతి

ఒకసారి నానాసాహెబ్ చందోర్కర్ ఒక అడవిగుండా ప్రయాణమై పోతున్నాడు. మార్గ మధ్యంలో ఆయనకు తీవ్రమయిన దాహంవేసి నాలుక పిడుచకట్టుకొని పోనారంభించింది. దాహంతో ప్రాణభయం వేసి "నా బాబా నా దగ్గర ఉంటే నా దాహం తీర్చేవారు కదా!" అని వాపోయాడు. మరుక్షణమే ఒక భిల్లుడు ఎదురై ఆ ప్రక్కనే ఉన్న బండను చూపుతూ "దాని క్రింద నీరు ఉన్నది బండను తొలగించి చూడు" అని అన్నారు. నానా బండను తొలగించి దాని క్రింద ఉన్న నీటిని త్రాగి దాహం తీర్చుకున్నాడు. ఆ భిల్లుడే కనబడి ఆ బండక్రింద ఉన్న నీటి వివరం తెలియచేయకపోతే నానా ప్రాణాలు దాహంతో పోయేవేమో. ఆ భిల్లుడే బాబా. బాబా సహాయం అలా ఎవరికయినా సమయానికి అందుతుంది. ప్రాణాలు పోయే తరుణంలో ప్రార్థించినంతనే ప్రత్యక్షమయి ప్రాణాలు నిలబెట్టిన ప్రాణనాథుడు అయిన సాయికి నానా ఏమిచ్చి తన కృతజ్ఞత చూపించుకోగలడు ప్రేమ పూర్వకమయిన కృతజ్ఞత తప్ప.

ఇలాగే ఒకసారి నానా టాంగాలో ప్రయాణమయి పోతున్నాడు. ప్రమాదవశాత్తు టాంగా బోల్తాపడి నానా చనిపోయే పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో మసీదులో బాబా రెండు చేతులను శంఖులాగా ఉంచి ఊదుతూ "నానా చావబోతున్నాడు నేనుండగా చావనిస్తానా" అని రెండు చేతులతో టాంగాను బలమంతా ఉపయోగించి నిలబెట్టినట్లుగా ఆయన చేతులతో నటించారు. అక్కడ టాంగా బోల్తాపడకుండా రోడ్డు మీద నిలచి నానా బ్రతికాడు. బాబా రక్షణ రవ్వంత ఆలస్యమయితే ఆ ప్రమాదంలో చిక్కుకుని నానా ప్రాణాలు పోగొట్టుకొని ఉండేవాడేమో. కనుక ఆ సద్గురునాథుడు అనుక్షణం తన భక్తుడయిన నానాను కాపాడుతూ మృత్యుముఖం నుండి కూడా బయట పడవేస్తూ వచ్చాడు. అలా తన భక్తులందరినీ సర్వకాల సర్వావస్థలయందు అత్యంత శ్రద్ధతో వారి నుండి ఏమీ ఆశించక కాపాడుతున్న ఆ సద్గురునాథునికి ప్రేమపూర్వకమయిన కృతజ్ఞతతో శరణాగతి చెందక మానుతారా?!

ఇలాగే 29-11-98న సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ ఆశీస్సులతో కందుకూరు సత్సంగ సభ్యులమందరము కందుకూరు సమీపంలో ఉన్న భైరవకోనకు వెళ్ళి తమ యాత్రాబస్సులో తిరిగి వస్తున్నాము.

కొందరు యువకులయిన సత్సంగ సభ్యులు ఆనందోత్సాహాలతో బస్సు టాప్ మీద కూర్చున్నారు. బస్సులోపల సత్సంగం జరుగుతూనే ఉంది. పామూరు శివార్లలో డ్రైవరు ఉన్నట్లుండి బస్సు ఆపి "ఎక్కడివారు అక్కడే కూర్చోండి. బస్సును కదిలించవద్దు. ఊగించవద్దు" అని కేకవేశారు. అందరూ సిర్ఘాంతపోయి బిగుసుకొని కూర్చున్నారు. ఐదు నిమిషముల తర్వాత అందరినీ నిదానంగా దిగమని చెప్పారు. దిగి చూతురు గదా! ముందు చక్రానికి ఉండవలసిన బోల్టులు అన్నీ ఎక్కడో పిరిగిపోయి బస్సునుండి చక్రము ఊగిపోవుటకు సిద్ధంగా ఉన్నది. ఆ క్షణంలో ఎవరో చెప్పినట్లుగా డ్రైవరు బస్సును ఆపి, ఆ విషయమును గమనించి ప్రయాణీకులంతా కదలకుండా ఉండమని హెచ్చరించి జాకీతో బస్సును స్థిరంచేసి ప్రయాణీకులను దిగమన్నారు. ఆ క్షణములో డ్రైవరు బస్సును ఆపి ఉండనట్లయితే మరుక్షణంలో బస్సునుండి ముందున్న ఎడమ చక్రము వేరయి టాప్ మీద ఉన్న యువ సత్సంగ సభ్యులు రాకెట్ వేగంతో ముందుకు దూసుకుని పోయి ఏ విధమయిన భంగిమల్లో ఎంతెంత దూరాల్లో క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకొని ఉండేవారో, లేక శాశ్వతంగా అవిటివారై ఉండేవారో, అలా బస్సు ఎన్ని పల్టీలు కొట్టి ఉండేదో, ప్రయాణిస్తున్న సత్సంగ సభ్యులందరూ ఏవిధమయిన అంగవైకల్యాలను పొంది ఉండేవారో ఆ సద్గురునికే ఎరుక. కేవలం ఆ సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ అనుగ్రహం వలన మాత్రమే సకాలంలో డ్రైవరు బస్సును ఆపగలిగారు. సత్సంగ సభ్యులందరూ రక్షింపబడ్డారు.

హృదయ పూర్వకమయిన భక్తిభావము కానీ, ప్రేమపూర్వకమయిన శ్రద్ధా, సబూరీలు కానీ తగినంతగా లేని సత్సంగ సభ్యులను వారి దోషాలు ఎంచక ప్రేమతో కాపాడిన ఆ సద్గురుని ప్రేమపూర్వక కృతజ్ఞతతో శరణాగతి చెందక ఏమవుతారు.

కనుక, ఆ సద్గురునాథుని ప్రేమను, దయను, రక్షణను, ఏ అర్హతాలేని భక్తుడు పొందిన మరుక్షణం ప్రేమపూర్వకమయిన కృతజ్ఞతతో ఆయనకు తప్పక శరణాగతి చెందుతాడు గదా!

ప్రార్థన : కరుణా సముద్రుడవయిన ఓ సద్గురునాథా!

* నా హృదయమంతా నిండిన నిన్ను మౌనంగా ప్రార్థించుకోనిమ్ము.
* నీ చరణకమలములను ఆశ్రయించి సదా నీ రక్షణలో సేద తీరనిమ్ము.
* నీ అనుగ్రహము అనుభవించిన నా హృదయం నిండా నీ పట్ల కృతజ్ఞతా భావమును నింపు.
* నన్ను నడిపిస్తున్న ఓ జగత్ రక్షకా! నా సర్వస్వము నీకే అర్పించనీ.
* నాతో ఎప్పుడూ, ఎల్లప్పుడూ ఉండి నన్ను కాపాడు సద్గురునాథా!

తేది: 6-12-98 పి. సాయిప్రసాద్ - కందుకూరు

## నాడు గయలో "బాబా" నేడు నెల్లూరులో "బాబూజీ"

నేను నెల్లూరు బాలాజీనగరులోని లక్ష్మీనగరునందు క్రొత్తగా ఇల్లు కట్టుకున్నాను. 28-2-99 శ్రీసత్యనారాయణస్వామి వ్రతము చేయ నిశ్చయించినాము. 28-2-99న మన క్రొత్త ఇంటిలో జరుగు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతమునకు తప్పక హాజరు కావలయునని, మీ యొక్క ఆశీస్సులు కావలయునని బాబూజీ గారికి ఉత్తరము వ్రాశాను. ఒకవేళ మీకు వెసులుబాటు లేకున్న ఏదో ఒక రూపములో బాబా యొక్క presence, బాబూజీగారి యొక్క presence ఇవ్వమని వేడుకొని 22-2-99న బాబూజీగారి షిరిడీకి ఉత్తరము వ్రాశాను. ఆశ్చర్యం. అద్భుతం. 26-2-99న నాకు గురుకృప జన్మదినసంచిక(డిశంబరు) అందినది. అందులోని బాబాముందు కూర్చొనియున్న బాబూజీ ఫోటో నన్ను ఎంతగా ఆనందపరిచినదో వ్యక్తపరుచుటకు మాటలు చాలవు. బాబాతో కలిసి బాబూజీ ఫోటో రూపములో సాక్షాత్కరించారు. నా ప్రార్థనను 3 రోజులలోనే మన్నించిన బాబూజీ యొక్క

అభిమానానికి కరుణకు కట్టుబడిపోయాను. వారికి చెమరించిన కండ్లతో మ్రొక్కి శరణాగతి వ్యక్తపరచుటకంటే ఏమి చేయగలను. నా యొక్క ఈ అనుభవమును ఎందరితోనో పంచుకున్నాను. మీకూ తెలియజేయుచున్నాను.

తేది:3-3-99 K.S. శ్రీనివాసమూర్తి (టీచరు) - నెల్లూరు.

## సాయినాథుని లీల

నా పేరు రావుల కోటేశ్వరరావు. ఓగూరు గ్రామం, కందుకూరు మండలం. నేను నా ఫ్రెండ్ సుదర్శనరావు కారణంగా సాయిబాబా భక్తుడిగా మారినాను(పరిచయమయినాను).

నేను గత రెండు సం||లుగా మోకాలు నొప్పితో బాధపడుతున్నాను. మందులు వాడినా ప్రయోజనం లేకపోయింది. చివరకు రెండు నెలల క్రితం నేను బాబూజీ గార్కి లెటర్ వ్రాసికొనినాను. బాబూజీగారు నన్ను కరుణించి నా మోకాలు నొప్పిని తొలగిస్తున్నట్లుగా కల వచ్చింది. తెల్లవారి లేచేసరికి నిజంగా కాలునొప్పి తగ్గిపోయింది.

'గురూజీ' దయవలన నా మోకాలు నొప్పి తగ్గిపోయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది చదవడానికి చిన్నదిగా ఉంటుంది. కాని నాకు మాత్రం జీవితంలో మరపురాని బాబూజీ ద్వారా జరిగిన మొదటి అద్భుతం. ఇది మరువరాని సంఘటన.

తేది : 9-2-99 రావుల కోటేశ్వరరావు - ఓగూరు.

## ఇలా చూద్దామా !

99 జనవరినెలలో గురుబంధువులు వేలాదిమంది గురువుగారి ఆశీస్సులు పొందు నిమిత్తంగా శిరిడీకి వచ్చారు. ఆ సమయంలో గురుబంధువులందరు "సాయిపథం" డైరీని తీసికొని ఉంటారు. ముఖచిత్రాన్ని చూచి ముచ్చటపడి ఉంటారు. ఇది దినచర్యలు వ్రాసుకొనేందుకు మాత్రమే ఉపయోగించేదికాదు. శ్రద్ధగా లోతుగా, సునిశిత దృష్టిని, ప్రసరిస్తే మొదటి పుట మొదలుకొని చిట్టచివరి పుట వరకు అంతర్వాహినిగా ప్రవహించు సరస్వతీ నదివోలె ఎన్నో విషయాలు అందులో మిళితమై ఉన్నాయి. వాటిని రసదృష్టి - అధ్యాత్మిక పుష్టితో పరిశోధనా సరళిలో పాఠకులకు అందివ్వాలని "గురుకృప" ప్రయత్నించింది. వచ్చేసంచికలో "ఆసక్తికరమైన విషయాలను చదివేందుకై ఉత్సాహించండి".

"గురుకృప"

## గురుదేవుల రక్షే - నా పాలిట లక్ష

మాది తిరుపతి. ప్రస్తుతము ఉద్యోగరీత్యా అసిస్టెంటు మేనేజరుగా ఏ.పి.యస్.ఆర్.టి.సి. నిజామాబాద్ లో పని చేయుచున్నాను.

గజేంద్రమోక్షములో మొసలితో బాధించబడుచున్న గజేంద్రుడు ప్రార్థించగా శ్రీ మహావిష్ణువు ఉన్న పళంగా వచ్చి రక్షించినట్లు చదివాము. అది పురాణ గాథ. గురువుగారు సాయినాథుని శరత్ బాబుగారి కృపను, కరుణను పురాణగాథకు మించి చవి చూడడము, అనుభవించడము జరిగింది.

1997 అక్టోబరులో విజయదశమిరోజు గురుదేవులు, అమ్మగారు, యస్.వి.యల్.నారాయణరావు గారు తదితర పెద్దల ఆశీర్వచనములతో గురుదేవుల సమక్షములో సాయియాన, శిరిడీలో మా అమ్మాయి దుర్గారాణి వివాహము జరిగింది. తరువాత వాళ్ళ అత్తగారి ఊరు నిడమర్రు మంగళగిరి మండలం వెళ్ళారు. 23-10-97 న చేతులు ఏమి బరువు పట్టుకోనివ్వటము లేదని మంగళగిరిలో డాక్టరుకు చూపించుకొనగా ఆయన నరాలకు సంబంధించిన డాక్టరుకు చూపించుకోమని చెప్పారు. మా అమ్మాయి, అల్లుడు వెంటనే బయలుదేరి తిరుపతి వచ్చారు. 25-10-97 న తిరుపతిలో Dr. V. Satyanarayana M.S. Neurologistకి చూపించాము. ఆయన ఏవో పరీక్షలు తదుపరి పరీక్షకు మద్రాసు తీసుకు వెళ్ళమని చెప్పారు.

26-10-97న మా అమ్మాయి తనకు లోపల ఏదో అవుతుంది. వ్యాధి నోటికి కూడా వచ్చింది. నేను బ్రతకను. నాకు మందులు వద్దు. ఒక్కసారి గురువుగారిని చూపించండి అని అన్నది. వాళ్ళ అమ్మ బాబాకి, గురుదేవులకు నమస్కరించుకొని ఊది నీళ్ళలో కలిపి త్రాగించింది. గురువుగారి కోసము, విషయము చెప్పుటకు శిరిడి ఫోను చేశాము. గురుదేవులు అచట లేరని చెప్పారు. ఏమి చేయాలో గురుదేవులు ఎచట ఉన్నారా అని మధనపడుతుంటే డాక్టరు నరేంద్రగారు నెల్లూరు నుండి 26-10-97 సాయంత్రం తిరుపతి రావడం జరిగింది. విషయము చెప్పగా గురువుగారు తిరుమలలో ఉన్నట్లు తెలిసి, నేను తిరుమల వెళ్ళుచున్నాను. విషయము గురువుగారికి తెలియచేస్తాను అన్నారు. మా అమ్మాయి గురుదేవులను చూడాలనే తొందరవల్ల అదేరోజు రాత్రి మా అమ్మాయిని తీసుకొని తిరుమల వెళ్ళడము జరిగింది. కాని అప్పటికే గురుదేవులు తిరువన్నామలై వెళ్ళారని గురుదేవులకు విషయములు తెలిసిందని, అన్ని పరీక్షలు చేయించమన్నారని డాక్టరు నరేంద్రగారు చెప్పారు.

27-10-97న మరల డాక్టరు ఓ.సత్యనారాయణకు చూపించితే. ఇది వైరస్ ఇన్ఫెక్షన్, శరీరమంతా వ్యాపించుతుంది. చాలా ప్రమాదము. వెంటనే SVIMS సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ - తిరుపతిలో చేర్చమన్నారు. అదే రోజు చేర్పించాము. డాక్టరు పరీక్షచేసి, ఈ వ్యాధి గుండెకు, మెదడుకు కూడా ప్రాకుతుంది. గాలి పీల్చుకోటం కూడా కష్టమవుతుంది కనుక రాత్రంతా ఎవరో ఒకరు మేలుకొని గమనించమని చెప్పారు. వాళ్ళు అన్ని పరీక్షలు చేసి ఇది వైరస్ ఇన్ఫెక్షన్, దీనికి వైరస్ ఇనేక్టివేటివ్ ఇన్‌జక్షన్స్ గాని రక్తమునుండి వైరస్ ని తీసివేసే Blood Purification గాని చేయాలి 30-10-97న లక్షరూపాయలు డిపాజిట్ చేస్తే ట్రీట్ మెంట్ మొదలు పెడతాము. ఆలస్యమైతే మా బాధ్యతకాదు. అవకాశం సగం-సగం అని 29-1-97న చెప్పారు. మరల గురువుగారికి విషయమును తెలియజేయుటకు ప్రయత్నము చేశాము. కాని వీలుకాలేదు. 30-10-97న నేనే స్వయంగా తిరుమల గురువుగారు ఉండే కాటేజి దగ్గర గురువుగారు ఎక్కడ ఉంది విచారించి, విషయము తెలుపుకుందామని 30-10-97న ఉదయం గం 8-30లకు తిరుమల వెళ్ళాను. అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమంటే అంతకు కొద్ది సేపుముందే గురుదేవులు తిరువన్నామలై నుండి తిరుమల వచ్చారని తెలిసింది. జరిగిన విషయమంతా ఎస్.వి.ఎల్.నారాయణ రావుగారికి తెలిపి గురుదేవులకు తెలుపమన్నాను. గురుదేవులే స్వయంగా పెళ్ళి జరిపించి, ఇపుడు హాస్పిటల్‌కి లక్ష రూపాయలు కర్చు పెట్టిస్తారని ఎట్లా అనుకొన్నావు. ధైర్యంగా ఉండు గురుదేవులకు విషయము చెప్పాము, మాట్లాడుదాము ఉండమన్నారు అని చెప్పారు. నేను తిరుమల నుండి 12-30కి హాస్పిటల్ కి ఫోన్ చేస్తే ఆశ్చర్యకరమైన విషయమేమంటే నిన్న అనగా 29-10-97 సాయంత్రం ట్రీట్‌మెంట్ గురించి తొందర చేసిన డాక్టర్లు 30-10-97 ఉదయం 9-30కి వచ్చినప్పుడు, పరీక్షించి ట్రీట్‌మెంట్ తొందరలేదు నాలుగురోజులు ఆగుదాము అన్నారట. అంటే గురుదేవులకు 8-30 కబురు అందిన దగ్గరనుండి పేషంట్ పరిస్థితి మారిందన్నమాట.

ఉదయం 8-30కి మాట్లాడుదాం అన్న గురుదేవులు రాత్రి 10-30కి దర్శనమిచ్చారు. అప్పుడుకూడా మాట్లాడదాము ఉండు అన్నారు. ఎస్.వి.ఎల్.నారాయణగారు హాస్పిటల్ లో వాళ్ళు ఆదుర్దాపడతారు నీవు వెంటనే వెళ్ళు, నేను కబురు పంపుతాను అన్నారు. నేను బయలుదేరిన కొద్ది సేపటికి గురువుగారు మరల పిలిచారని

తరువాత తెలిసింది. నేను హాస్పిటల్‌కి వెళ్ళేసరికి మా అమ్మాయి సంతోషముగా చేతులలో కొంత మార్పు వచ్చింది. ఏపిల్ ముక్కలు పట్టుకోగలుగుతున్నాను అని చెప్పింది.

31-10-97 ఉదయం గురుదేవులు డాక్టరు నరేంద్రను, వారి భార్య డాక్టరు పద్మను, మా అమ్మాయిని పరీక్షించి వ్యాధి లక్షణములు వివరముగా వ్రాసుకురమ్మని తిరుపతి హాస్పిటల్‌కి పంపించారు. వారు అన్ని వివరముగా వ్రాసుకొని, వెళుతూ నన్ను సాయంత్రము గురుదేవులు కలవమన్నారని చెప్పారు. అదే రోజు రాత్రికి నేను నా భార్య తిరుమల వెళ్ళి గురువుగారి దర్శనము చేసుకొన్నాము. అమ్మాయి విషయము విచారించి అమ్మాయికి SVIMS డాక్టర్లు చెప్పిన ట్రీట్‌మెంట్ అవసరములేదు నేను నరేంద్రతో చెబుతాను. హోమియో మందులు ఇస్తారు అన్నారు.

తీవ్రమైన వ్యాధిని, అది SVIMS Super Speciality డాక్టర్లు బ్రతకటానికి అవకాశాలు సగం - సగం అని చెప్పిన వ్యాధిని, మా ఆర్తిని గురుదేవులకు విన్నవించుకొనుటకు, మాకు దగ్గరలోకి అంటే తిరుమలకు వచ్చి కేవలం నోటి మాటతో వ్యాధిని నయం చేసి, సంపూర్ణ ఆరోగ్యం కలిగించారంటే, గురుదేవులు ఎవరో కాదు సాయిబాబానే, ఆయన సర్వాంతర్యామి, సర్వశక్తిమంతులు అని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనమేమికావాలి? గురుదేవుల దయకు, మాపై చూపిన అపారమైన కరుణకు మేము జన్మజన్మలకు రుణపడి ఉంటాము.

తేది : 1-2-99 ఎం.సూరారెడ్డి - నిజాంబాద్

## "రక్షించింది గురువుగారే<br>ఆదరించింది గురువుగారే"

నా పేరు మురళి తిరుపతికి సమీపంగా ఉండు "నరసింగాపురం" మా ఊరు. ఈ మధ్య అక్కడ సత్సంగాన్ని ఏర్పాటు చేసినారు. గురువుగార్ని కలవాలనే భావన నాకు సత్సంగంవలన కలిగింది. గురుబంధువులు పూర్ణచంద్రరావుగారితో కలిసి గురువుగారి దగ్గరకు శిరిడీకి వెళ్ళాలని అనుకొన్నాను. కాని పూర్ణచంద్రరావుగారికి సెలవు దొరకనందున మరో గురుబంధువు చిరంజీవి సాధనతో కలసి 98 జూలై 9న గురుపూర్ణిమకి శిరిడీకి వెళ్ళినాను.

ఈ సందర్భములోనే మరో విషయాన్ని మన గురుబంధువులకు తెలియజేయాలి. స్నేహితుల కారణంగా వెంకటబాబు అనే మరో గురుబంధువు ఆర్థికంగా 50 లక్షలదాకా కోల్పోయి, మానసిక అశాంతికి గురై దిక్కుతోచక అలమటిస్తున్నతనికి నేను గురువుగార్ని గూర్చి చెప్పి నీ సమస్యలు సర్దుబాటౌతాయి వారిని దర్శించమని చెప్పాను. అతనుగూడా తన కష్టాలు గురువుగారితో చెప్పాలని శిరిడీకి వచ్చాడు. నేను అతన్ని గురువుగారికి పరిచయంచేసి అతని సమస్యలను చెప్పాను. వెంకటబాబును శిరిడీకి తీసికొనివచ్చి మంచిపని చేసావని నన్ను మెచ్చుకొన్నారు. ఆ సమయంలో నాకెంతో ఆనందమేసింది.

నన్ను ఆ రాత్రి గురుస్థానం చుట్టూ ప్రదక్షిణాలు చేయమనగా ప్రదక్షిణాలు చేస్తుంటే నాకు వెన్ను నొప్పి వచ్చింది. అయినా గురువుగార్ని, బాబాను స్మరిస్తూ ప్రదక్షిణలు చేస్తుంటే నొప్పి తగ్గిపోయింది. ఆ తరువాత జూలై 22వ తేదీ తిరుపతికి శిరిడీనుండి నేను బయలుదేరాను.

నేను బయలుదేరిన సమయానికి అంటే 22వ తేదీన తిరుపతిలో ఉన్న నా భార్య మహేశ్వరికి ఆరోగ్యము సరిలేక మాకు బాగా తెలిసిన డాక్టరు ఆర్.మునికృష్ణారెడ్డిగారి దగ్గరకు వెళ్ళింది. వారు పరీక్షించి కిడ్నీలో రాళ్ళున్నాయని చెప్పి, "రుయా" హాస్పిటల్ లో చేరమని చెప్పారు. నేను సమయానికి దగ్గరలేని కారణంగా తెలిసిన

గురుబంధువులు నా భార్యను "రుయా" హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళారు. అక్కడున్న పెద్ద డాక్టరుగారు ఎక్స్-రే తీసినారు. నేను ఆ మరుసటిరోజు అంటే 23వ తారీఖున తిరుపతికి చేరబోయేముందే "రేణిగుంటలో" నా భార్యకు సీరియస్ గా ఉందని "రుయా" లో చేర్చారని తెలిసి తీవ్రమైన ఆవేదనకులోనైనాను. వెంటనే గురువుగారిని ప్రార్థించుకొనినాను. నాకు ఏం జరిగినా చూచుకోవటానికి గురువుగారున్నారనే ధైర్యం తెచ్చుకొని ఈ విషయాన్ని గురువుగారికి తెలియజేద్దామనే తలంపుతో శిరిడీకి ఫోను చేసాను. ఫోను శ్రుతి అందుకుంది. అమ్మలేదు సాధనక్క ఇక్కడేవుందని శ్రుతి చెప్పి ఫోను సాధనకు ఇచ్చింది. నా భార్యకు కల్గిన అనారోగ్యము, నా మానసిక ఆందోళనను గురించి గురువుగారికి తెలియజేయమనినాను. ఆ తరువాత ఆమె గురువుగారికి నా విషయం విన్నవించగా, ఆందోళన వలదని ధైర్యంగా ఉండమని చెప్పారట.

ఈ లోగా నా భార్యను రాయలసీమ హాస్పిటల్‌లో ఎక్స్-రే తీసి కిడ్నీలో రాళ్ళు ఏ పరిమాణంలో ఉన్నవో రిపోర్టు వ్రాసినారు. ఆ రిపోర్టును మెడికల్ ఆఫీసరు 'SVIMS Hospital' కి పంపించారు. SVIMS లో జేర్పించిన తరువాత వాళ్ళు మళ్ళీ అయిదు ఎక్స్-రేలు తీసారు. అంతకు ముందు రాయలసీమ హాస్పిటల్ లోని రిపోర్టుని SVIMSలో తీసిన ఎక్స్-రేలు చూచారు. గురువుగార్కి ఫోను చేయకముందు 'కిడ్నీ'లో రాళ్ళున్నాయని రిపోర్టులో ఉంది. ఫోనుచేసి వారి అభయం పొందిన తరువాత తీసిన ఎక్స్-రేలో కిడ్నీలో రాళ్ళు లేనట్లుగా రిపోర్టు వచ్చింది. ఈ విషయాన్ని నిర్ధారణ చేయటానికి ఒక వారం పట్టింది.

తరువాత నాతో ఈమెకు జన్మతః మూత్రనాళిక చాలా చిన్నదిగా ఉంది అని చెప్పి, దానికి కావలసిన మందులు చెప్పి, వాడే విధానాన్ని చెప్పారు. తరువాత నా భార్యను డిస్చార్జ్ చేసారు. నేను హాస్పిటల్లో ఉన్నన్నిరోజులు, రోజూ మా అందరికి శ్రేయోభిలాషులైన ఎస్.వి.ఎల్. గారికి ఫోనుద్వారా ఎప్పటి విషయాలు అప్పటికి చెప్తూ గురువుగారికి నివేదించమన్నాను. వారు తు.చ.తప్పకుండా నా విన్నపాన్ని అలాగే గురువుగారికి చెప్తూ నాకు ధైర్యం చెప్పారు. మా విషయంలో గురువుగారు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నారని చెప్పేసరికి నాలో బాధనేది లేకుండా పోయింది.

హాస్పిటల్ నుంచి డిస్చార్జి అవుతూనే ఎస్.వి.ఎల్.నారాయణరావుగారికి ఫోను చేసాను. గురువుగారు మిమ్మల్ని కుటుంబముతో సహా శిరిడీకి రమ్మన్నారని ఫోనులో చెప్పారు. ఆగష్టు 11వ తారీఖున నేను, నా భార్యతో కలసి శిరిడీకి బయలుదేరాము. ఆగష్టు 13వ తారీఖున నా పెళ్ళిరోజు. ఆ రోజు మా దంపతులిద్దర్ని గురువుగారు ఆశీర్వదించి కొత్తబట్టలు పెట్టారు. గురువుగారి సన్నిధిలో శిరిడీలోనే మా మ్యారేజ్ డే జరుపుకొన్నాము.

నాకు వివాహమైన 7 సంవత్సరములలోపుగా నా బంధువులుగాని, ఆత్మీయులుగాని, అంతటి అనురాగంతో, అలాంటి ఆప్యాయతతో, ఆదరించి, ఆశీర్వదించి బట్టలుపెట్టినవారు లేరు. గురువుగారు చూపిన ఆప్యాయత ఇంతవరకు నేను ఎక్కడా చూడలేదు. ఆ రోజు దైవంలా నా భార్యను గురువుగారు రక్షించారు. ఈ రోజు అమ్మా, నాన్నల స్థానంలో అనసూయమ్మగారు, గురువుగారు ఉండి కొత్త బట్టలను కట్టుకోమని ఆశీర్వదించిన రోజున నా ఆనందానికి అవధిలేదు. నా భార్యను నిజంగా గురువుగారే కాపాడారు.

నమస్కారములతో...

తేది : 4-12-98 "మురళి" - నరసింగాపురం.

("వెంకటబాబు విషయాన్ని వచ్చే సంచికలో చదవగలరు")

## "నడయాడే సాయిరూపం"

తద్విద్ధిప్రణి పాతేన పరిప్రశ్నే సేవయా.... అన్న వ్యాసభగవానుల మార్గము వైపుకు నా బుద్ధిని మరలించాను. అంతకన్న మిన్నయైన మరో మార్గము నాకు తోచలేదు.

ప్రశ్న : "బాబా" భక్తునిగా ఎలా కాగలుగుతారు.

*జవాబు : అందులో "వాని" ప్రయత్నమేమీలేదు. ఆ ఎంపిక "బాబా"దే.*

ప్రశ్న :పోనీ "బాబా" అనుగ్రహము పొందటానికి అర్హత ఏమిటి?

*జవాబు :"బాబా" అంటే ఇష్టముండాలి. 'బాబా'ను ప్రేమించగలగాలి. ఆరాధించటమూ, ఆధారపడటమూ, వీటికంటె మించిన అర్హతలు ఏముంటాయి.*

ప్రశ్న : ఈ అర్హత.... ఆధారపడటమంటే ఏమిటి?

*జవాబు :నన్ను "బాబా" కాపాడినంత చక్కగా ఇంకెవరు రక్షించలేరు. "బాబా"కు శరణాగతి చెందటము. అన్నింటా "బాబా"యే దిక్కు ప్రతిదీ "బాబా" పరముగానే జరుగుతుందనే పరిపూర్ణ విశ్వాసములుండాలి. ఏ ఆధారమూ లేనివానిని చూచి మీరెలా జాలిపడతారో అలానే మనకు "బాబా"యే ఆధారమను భావన కలగాలి.* (అర్థంకాని రీతిగా ప్రశ్నార్థకముగా మారిపోయిన నా వదనమును చూచారు. చిరునవ్వునవ్వారు. "అమ్మయ్య" అని ఊపిరి పీల్చుకొనినాను.)

ప్రశ్న :సార్! కొంచెము విశదముగా వివరించగలరని నెమ్మదిగా నసిగాను. గురువుగారు నా పరిస్థితికి జాలిపడి...

*జవాబు : అడపాదడప, మన ఇళ్ళకు బిచ్చగాళ్ళు వస్తారుగదా! ఏలాంటి బిచ్చగానికి మీరు భిక్షమేస్తారు.*

ప్రశ్న : భిక్షము వేయటానికి గూడా అర్హత ఉండాలా?

*జవాబు :బిచ్చము వేయటానికి అర్హత అంటే ఆ భిక్షము తీసుకొనే వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని ఆలోచించండి... అర్థంకాలేదుగదా!* (నిజానికి నాకు అర్థంకాలేదు.)
*బాగా బలంగా ఉండి, ఎగుభుజాలు, పిక్కలు ఎగదన్నుకొని బలిష్టంగా ఉండి మధ్యవయస్కుడైన యువకుడు సోమరిపోతై భిక్షావృత్తిలో బ్రతుకుదామని బయలుదేరి... ఇంటింటి ముందు యాచిస్తే, ఎందరు అతనికి భిక్షమేస్తారో చెప్పు... పైగా ఏమంటారో ఊహించు.*

ఈసారి జవాబు చెప్పటం నా వంతైంది.

నా సమాధానము :భిక్షము పెయ్యకపోగా! ఏం రోగం నాయనా? దున్నపోతులా ఉన్నావు, కాలొంకరా, చెయ్యొంకరా? అడుక్కోడానికి సిగ్గులేదూ! కష్టం చేసుకోరాదూ! నాలుగిళ్ళలో పాచిపని చేసుకున్నా నీ పొట్టగడచి పోతుందే! కాఫీ హోటల్లో కప్పులు కడిగైనా సుఖంగా బ్రతకొచ్చే. రోజువారీగా కూలికి పెళ్ళినా తేలిగ్గా రూ.10లు సంపాదించుకోవచ్చని అంటాను.

గురువుగారు :కదా! మరి.. నాలుగైదు ఎకరాల పొలముండి. లక్ష రూపాయల బ్యాంకు బ్యాలెన్స్ ఉండి, పెట్టుబడిలేని వ్యాపారమని భిక్షకు వస్తే అతని విషయం తెలిసినవారు ఏం చేస్తారు?

నా సమాధానము: అసహ్యించుకుంటారు.

గురువుగారు : అవునుగదా! ఎలాంటి భిక్షగాణ్ణి మీరు ఏవగించుకున్నారో గుర్తుంచుకోండి... 90 సంవత్సరాల వయస్సుండి, బాగా వృద్ధాప్యముండి లేవలేక లేస్తూ, పడుతూ... చస్తూ... బ్రతుకుతున్న బిచ్చగాణ్ణి చూస్తే మీకేమనిపిస్తుంది.

నా సమాధానము: జాలి వేస్తుంది.

గురువుగారు : కాళ్ళు చేతులు, సక్రమంగా లేకుండా, పాకుతూనో, పొరాడుతూనో, చక్రాల బండిమీదో ఉండే భిక్షగాణ్ణి చూస్తే?

నా సమాధానము: జాలి వేస్తుంది.

గురువుగారు : ఒక వ్యక్తి చాలా నీరసంగా ఉండి, అయ్యా! నేను భోజనం చేసి మూడు దినాలైంది. ఇంత అన్నం పెట్టించండి అని దీనంగా ప్రాధేయపడి అడిగాడనుకో, ఏంచేస్తారు.

నా సమాధానము: తప్పకుండా అన్నం పెట్టిస్తాను.

గురువుగారు : అడుక్కొనే వ్యక్తి, ఘరానాగా... మీకు ముక్తికలిగేందుకు అవకాశమిస్తున్నాం... డైరెక్టుగా స్వర్గానికెళ్ళే ఛాన్స్ ఇస్తున్నాను, ధర్మంచేసుకోండి అని అడిగితే.

నా సమాధానము: ఛస్తే పైసాగూడా ఇవ్వను.

గురువుగారు : పై వ్యక్తికి ఇవ్వటానికి కారణమేమిటి? రెండో వానికి ఇవ్వకపోవటానికి కారణమేమిటని ఆలోచిస్తే... అడిగిన విధానము. ఆధారపడిన తీరు అని అర్థమౌతుంది. దారిలో మనం వెళ్ళుతున్నపుడు మూర్ఛరోగి ఒకడు హఠాత్తుగా మూర్ఛవచ్చి నేలపైబడి నురగలు క్రక్కుతూ, చేతులూ, కాళ్ళూ దబదబామంటూ కొట్టుకొంటూ లేవలేక దభీమని క్రిందకు పడిపోయినప్పుడు మీరంతా చూస్తే ఏం చేస్తారు.

నా సమాధానము: తప్పకుండా ఆదుకుంటాము. పదిమందిని పిలిచి బక్కెట్లకు బక్కెట్లుగా నీళ్ళుపోసి త్రాగినన్ని నీళ్ళు పోసి ఆపైన తోచింది చేతుల్లో వేస్తాము.

గురువుగారు : *అంతేగదా... ఓ వ్యక్తి రోడ్డుపై నిలబడి "బాబూ" నేను వట్టి గ్రుడ్డివాణ్ణి రోడ్డుదాటలేనివాణ్ణి, అసహాయస్థితిలో ఉన్నవాణ్ణి దయుంచి జాలిగల మహానుభావులు నా చేయిపట్టుకొని రోడ్డు దాటించండని దీనంగా అడిగితే ఏం చేస్తారు.*

నా సమాధానము: తప్పకుండా దాటిస్తాము.

గురువుగారు : *అదే విధంగా... ఆ దాటించినవాడు మహానుభావుడోకాదో మనకు తెలియకపోయినా ఆ అడిగిన విధానము ఆ వ్యక్తికి జాలిగొల్పించి ఉంటుంది. ఆధారపడటమంటే ఎలా ఉంటుందో, "బాబా"ను ఎలా అర్థించాలో బోధపడిందనుకుంటాను. ఆధారములేనివాని స్థితి ఎలా ఉంటుందో మనకు అవగతమైతే గదా! "బాబా"పై మనం ఎలా ఆధారపడాలో అర్థమయ్యేది!*

ప్రశ్న : అంటే మేమంతా.... అంటూ వక్రంగా అడగబోతున్న నన్ను వారించారు.

గురువుగారు : *నీవేమి అడగబోతున్నావో నాకు తెలుసు బిచ్చమేసే మహారాజు "బాబా"యే అయినపుడు ఆయన ముందు జోలి తగిలించుకొని, భిక్షాపాత్రను చేతపట్టుకోవటానికి సిగ్గుపడవలసిన పనేలేదు. ఆయన ముందు నేను బిచ్చగాడినే. ఆయన వేసేది ఏదైనా నాకిష్టమే. ఆయన తిని రాల్చిన ఎంగిలి మెతుకైనా నాకు పెన్నిధితో సమానమే అన్నారు శాంతంగా గాంభీర్యంగా గురువుగారు.*

నేను ఎలాంటి ప్రశ్న వేయబోతానో ముందుగానే వారికి తెలిసింది. ఆ విషయములో మనవారికెలాంటి సంశయములేదు. వేలాది పుస్తకాలను చదివిన రీతిగానే వారి సన్నిధికి వచ్చే లక్షలాది మందిని, వారి హృదయాలను, వారివారి మనోగత భావములను వారవలీలగా చదువుతున్నారు. చంద్రమతి మాంగల్యము, హరిశ్చంద్రునికి మాత్రమే కన్పించిన రీతిగా, వారి ముందు సాష్టాంగ నమస్కారము చేసుకొనబోయేముందే మనమేమిటో, మన సంస్కారమేమిటో, మన వాసనలు ఏమిటో, ఎందుకు వచ్చామో! ఏమడగాలనుకుంటున్నామో! సర్వమూ మనకన్న ముందుగా ఆ మహనీయునికి సద్గురు స్వరూపునికి తెలిసిపోతుంది. "బాబా"కు ఎలా తెలిసేదో, అలానే మన గురువుగారికిగూడా తెలుస్తుంది.

ఒకసారి ఇలాగే ఏమైందో వివరిస్తాను. చాలా దూరప్రాంతమునుంచి ఓ భక్తురాలు బాబా సన్నిధిలో పారాయణ చేయాలని శిరిడీకి వచ్చింది. వచ్చిన తరువాత గురువుగారిని గురించి విని వారిని దర్శించటానికి వచ్చింది. తానే పుస్తకమును "బాబా" సన్నిధిలో పారాయణచేస్తే బాగుంటుందో గురువుగారిని అడిగింది.

అమ్మా! నీవు నిజంగా నేను చెప్పిన పుస్తకాన్నే పారాయణ చేయాలని అనుకున్నదానివైతే నేను చెప్పిన తరువాతనే పుస్తకాన్ని తెచ్చి పారాయణచేస్తావు. నీవు ముందుగానే, నీ ఆలోచనలకు అనుగుణంగానే ఎవరో చెప్పిన పుస్తకాన్ని పారాయణ చేయాలని తెచ్చావు. ఆ పుస్తకమే చదవాలనుకున్నావు దాన్నే ఇక్కడకు తెచ్చావు. ప్రస్తుతం అది నీ చేతి సంచీలో వుంది. కావాలనుకుంటే చూడు. ముందేది చదవాలని ఆప్యాయంగా తెచ్చుకొన్నావో అదిగో ఆ పుస్తకాన్నే పూర్తిచేయి అన్నారు గురుదేవులు. ఆమె నమస్కరించి వెళ్ళిపోయింది.

ఆమె ఉద్దేశమేమిటో నాతోపాటు మీ అందరికీ అర్థమైందనుకుంటాను. ఆమె తెచ్చుకున్న పుస్తకాన్ని కాకుండా గురువుగారు ఇంకొకటి చెప్పినపుడు ఆమె చదివితే మంచిదే. ఏ ఫలితమును ఆశించి ఆమె ఆ పని చేస్తుందో త్వరితగతిని ఫలము లభిస్తుంది. అలా కాకుండా భిన్నంగా చేస్తే, ఆమెకు "దోష"మన్నది సముత్పన్నమౌతుంది.

ఓ మహాత్ముణ్ణి, అవతార పురుషుణ్ణి, కారణజన్ముని, మనమంతట మనమే వారిని సలహా అడిగినప్పుడు, నీ ఇష్టాయిష్టాలతో నిమిత్తముండదు. ఎందుకంటే "మనకేది మంచిదో-మనకేదిచెడో" మనకంటే బాగా మన స్వామికెరుక.

కొన్ని సమయాలలో మహాత్ములు మన మనుకున్న దానికి భిన్నముగా చెప్పవచ్చు. వారు చెప్పిన విధానము మనకు రుచించక మన మనుకొనిన దానికనుకూలముగా సాగిస్తాము. అందువలన ఇబ్బందులెదురౌతవని మహాత్ముల చరిత్రలు నిర్ధారించుతున్నాయి.

బాబాను దర్శించిన భక్తులు తిరిగి వెళ్ళుటకు అనుమతిని అర్థించగా తొందరేముంది భోజనం చేసి వెళ్ళమన్నారు. బాబా చెప్పినట్లుగా భోజనముచేసి వెళితే వారనుకున్న బండికి వెళ్ళలేక పోవచ్చుని రైలుకు వెళ్ళే తొందరలో "బాబా" మాటను పాటించక ముందుగా రైల్వేష్టేషనుకు వెళ్ళిన కొందరు భక్తులకు రైలు ఆలస్యమై తినేందుకు ఏమీ దొరకక పస్తుండి ఇబ్బంది పడినారని, బాబా అనుమతిని పాటించినవారు హాయిగా భోజనముచేసి వారు ఎక్కవలసిన రైలును ఎక్కినారు. ఈ విషయాన్ని మనం సాయిచరిత్రలో చూడగలం - ఇలాంటివి ఎన్నో సంఘటనలున్నాయి.

అందుకనే మహాత్ములతోను, మన గురువుగారి వంటి కారణజన్ములతోను నడయాడే సాయిరూపమైన "బాబూజీ" గారితోనూ నీ మనోగత భావాన్ని స్పష్టముగా చెప్పాలి. లో భావన వారి ముందు మంచిది కాదు.

*గురువుగారు* : *బాగా ఆకలౌతున్నవారు ఇంటికి వచ్చి వాళ్ళమ్మను భోజనము వడ్డించమనే విధానాన్ని గమనించండి. ఓ అయిదు నిమిషాలాగు అంటే... ఆగగలడా? అరగంటాగు, పప్పు, కూర, సాంబారుచేసి వడ్డిస్తానంటే ఏమంటాడు. ఏదుంటే అది పెట్టు అని అడుగుతాడు. అలా "బాబా"ను అడగగలగాలి. అంతటి అవసరము, శ్రద్ధ, నీలో ఎదగాలి. అంతేగాని ఆధారపడటమంటే కాళ్ళు, చేతులు, కళ్ళు పీకేసుకోవటం కాదు. బిచ్చమడిగిన వాని అర్హత ఏమిటో నీకు అర్థమైన రీతిగానే, "బాబా"ను అడిగేవాడు ఎలా ఆధారపడ్డాడో తెలుస్తుంది బాబాకు.*

ప్రశ్న : ఈ భావాన్ని మరికొద్దిగా విశద పర్చగలరు. ఆ అర్హత నాకు రావాలంటే వస్తుందా.

*గురువుగారు* : *నీకేమిటి... ఎవ్వరికైనా వస్తుంది.*

ప్రశ్న : అలా రావాలంటే సులభమైన ఉపాయాన్ని చెప్పండి సార్...

మిగిలిన వివరాలు వచ్చే సంచికలో వివరిస్తూ మాటల మధ్యలో అందమైన కథలను సందర్భానికి అనుగుణంగా నడయాడే సాయిరూపం ఎలా వివరిస్తారో ఎదురు చూద్దాము...

డా.జి. సాయివరప్రసాదరావు - రేపల్లె.

*సద్గురుదేవ పద రాజీవముల దలంచు క్షణముననే మన జీవితమున మేలు చేకూరును*

*శ్రీ సాయి అనుసరనము*

# పారాయణ

దుఃఖహేతువులైన వ్యక్తిత్వపు పరిమితులను దాటించి,
అన్ని పరిమితులకు పరమైన ఆనందాన్నందించి,
పరాయణత్వాన్ని కలిగించేదే - పారాయణ!

ఒకానొక మహత్తర అంశాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి,
అపారమైన దాని తత్వాన్ని ఆకళింపుచేసుకొనే సాధనం - పారాయణ!

సద్గురుదివ్య పాదాలను హృదయంలో ప్రతిష్టించుకొని
భక్తిరాగరంజితమైన మనస్సనే కుంకుమతో
ఆ పాదాలకు పారాణిచేయడమే - పారాయణ!

- శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ

kif fik